సాక్షి నిజామాబాద్

మంగళవారం । 16 । జూలై । 2024



పొలిమేర దాటిస్తున్న పోలీసు

బోధన్ నియోజకవర్గంలోని ఓ పోలీసు అధికారి కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది.

- 8లో ▸



ప్రజావాణికి 91 ఫిర్యాదులు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 91 ఫిర్యాదులు వచ్చాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.9 /22.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. జిల్లాలోని పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా అన్వేష్ రెడ్డి బాధ్యతలు



ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా సుంకెట అన్వేష్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, శాసనసభ్యులు డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి, రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్, రాష్ట్ర కో–ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఆర్మూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులను పరిష్కరించాలి



నిజామాబాద్‌నాగారం: ప్రజాపాలన దరఖాస్తులను పరిష్కరించాలని సిబ్బందిని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ జోన్ -4లో గల కంఠేశ్వర్ వాటర్ ట్యాంక్ వద్ద కొనసాగుతున్న ప్రజా పాలన సేవా సోమవారం తనిఖీ చేశారు. ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి, ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన విషయం విదితమే. అయితే పలు కారణాల వల్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకాలు పొందలేకపోతున్న అర్హులైన వారికి లబ్ధి చేకూర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ సేవా కేంద్రాన్ని సందర్శించి దరఖాస్తులు పరిష్కరిస్తున్న తీరును పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లోపాలను సవరించి, పరిష్కారానికి ఆస్కారం ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తిక్ తదితరులున్నారు.

బోధన్ రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన ఏడీఆర్ఎం



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ రైల్వేస్టేషన్‌ను సోమవారం రైల్వేశాఖ ఏడీఆర్ఎం రెహమాన్ తనిఖీ చేశారు. స్టేషన్‌లోని ప్యాసింజర్, గూడ్స్ ప్లాట్‌ఫాంలను పరిశీలించారు. గూడ్స్‌రైలు లోడింగ్ చేసే ప్లాట్‌ఫాం వద్ద వర్షపు నీరు నిలుస్తున్నాయని తమ దృష్టికి వచ్చిందని ఏడీఆర్ఎం తెలిపారు. సమస్య పరిష్కారించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. 10 రోజుల్లో మరమ్మతులు ప్రారంభమవుతాయని చెప్పారు. బోధన్–మహబూబ్‌నగర్, మిర్జాపల్లి, కరీంనగర్ ప్యాసింజర్ రైళ్లు ఎప్పుడు ప్రారంభిస్తారని స్థానికులు విన్నవించారని.. త్వరితగతిన సేవలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు బోధన్ నుంచి టికెట్‌లు మంజూరు చేయాలని తమ దృష్టికి తీసుకువచ్చారని ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పారు. అలాగే స్టేషన్‌లో వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపాలని అధికారులు సూచించారు. రైల్వే ఏడీఆర్ఎం వెంట స్టేషన్ మాస్టర్ రాము ఉన్నారు.



రుణమాఫీకి ముందడుగు!

- మార్గదర్శకాలు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రైతు కుటుంబానికి రేషన్ కార్డే ప్రామాణికం
- వివరాలు సమర్పించాలని బ్యాంకర్లకు ఆదేశాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): రైతులు తీసుకున్న పంటరుణాల మాఫీకి సంబంధించిన మార్గదర్శకాలు సోమవారం విడుదలయ్యాయి. భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం రేషన్ కార్డును ప్రామాణికంగా చేసుకుంటామని వెల్లడించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వచ్చే నెల ఆగస్టు 15 నాటికి రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని, 2018 డిసెంబర్ 12వ తేదీ నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు పంట రుణాలు తీసుకున్నవారికి వర్తిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. ఇందుకు రైతు వారీగా తీసుకున్న పంట రుణాలు, రుణఖాతా వివరాలను సమర్పించాలని బ్యాంకర్లను ఆదేశించింది. జిల్లాలో పంట రుణాలు తీసుకున్న వారి సంఖ్య 1,38,813 మంది ఉండగా 1.80 కోట్ల వరకు రుణం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. 2018 డిసెంబర్ 12వ తేదీ నుంచి వాణిజ్య, ప్రాతీయ, గ్రామీణ బ్యాంకుల్లో, సహకార బ్యాంకులు, సొసైటీల్లో ఎవరెంత రుణాలు తీసుకున్నారో వివరాలు తీయాల్సి ఉంది. స్వల్పకాలిక రుణాలకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించిన సందర్భంగా ఈ కోణంలో కూడా వివరాలను బ్యాంకర్లు బయటకు తీయాలి. కాగా రుణమాఫీకి రేషన్‌కార్డు లింకు చేయడంతో జిల్లాలో రేషన్‌కార్డున్న రైతులకే రుణమాఫీ వర్తించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

రేషన్ కార్డున్న రైతులెందరు..!

జిల్లాలో 4,05,000 రేషన్ కార్డులు ఉండగా ఇందులో వ్యవసాయ భూమి ఉన్న రైతులెందరో లెక్కలు తీయాల్సి ఉంది. ఎక్కువ చిన్న, సన్నకారు రైతులకే రుణమాఫీ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. వివరాల సేకరణకు ప్రతి బ్యాంకుకు ఒక నోడల్ అధికారిణి నియమించగా, ప్రభుత్వం ఇచ్చిన ప్రొఫార్మాలో డేటాను నమోదు చేయాల్సి ఉంది. కచ్చితమైన డేటా ఇవ్వకపోతే వారిపై కఠినంగా ఉంటామని ప్రభుత్వం హెచ్చరించింది. రుణమాఫీ పథకానికి అర్హులైన రైతుల వివరాల కోసం ప్రత్యేకంగా ఐటీ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. దీనిని వ్యవసాయ, ఎన్ఐసీ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తాయి. వీరు బ్యాంకర్ల సహాయంతో రైతు పట్టాపాసు పుస్తకం, రుణం పొందిన ఖాతా, ఆధార్, రేషన్‌కార్డును ఒకచోట లింకు చేయనున్నారు. తొలుత రూ. 2 లక్షల లోపు రుణం తీసుకున్న రైతుల ఖాతాల్లో మాఫీ డబ్బులు జమ చేయనున్నారు. రూ. 2లక్షల కంటే ఎక్కువ క్రాప్‌లోన్ తీసుకుంటే పైబడిన రుణాన్ని రైతులే బ్యాంకు చెల్లించాలి. ఆ తర్వాత ప్రభుత్వం రుణం డబ్బులు ఖాతాలో జమ చేస్తుంది. పదేళ్ల తర్వాత పూర్తి రుణమాఫీ కానుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంచి నిర్ణయం



ఒకేసారి రూ. 2లక్షల రుణమాఫీ చేయడం చాలా మంచి నిర్ణయం. 2009లో అప్పటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పూర్తి రైతు రుణమాఫీ చేశారు. మళ్లీ ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీకి చర్యలు తీసుకోవడం హర్షనీయం. ఇప్పటి వరకు క్రాప్‌లోన్ మాఫీకాని రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలి. – గడ్డం శ్రీనివాస్ రెడ్డి, రైతు, మైలారం

ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ. 2లక్షల రుణమాఫీపై మార్గదర్శకాలు ఇవ్వడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకో కుండా క్రాప్‌లోన్ తీసుకున్న రైతులందరికీ మాఫీ వర్తింపజేయాలి. రుణమాఫీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుంది. – గొడిసెరం భూమేష్ రెడ్డి, రైతు, డొంకేశ్వర్

చలో అరుణాచలం..

- పౌర్ణమికి ఇందూరు నుంచి ఆర్టీసీ బస్సులు
- 21న గిరిప్రదక్షిణకు ప్రత్యేక సేవలు
- ప్యాకేజీలో కాణిపాకం, శ్రీపురం, జోగులాంబ శక్తిపీఠం సందర్శన



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అరుణాచలం, అరుణగిరి, తిరువణ్ణామలై అనే పేర్లతో పిలుచుకునే తమిళనాడులోని శైవ క్షేత్రం సందర్శనకు ఆసక్తి చూపేవారిలో తెలుగువాళ్లే అధికం. అరుణగిరి ప్రదక్షిణ చేసి అగ్ని లింగాన్ని దర్శించుకునేందుకు వెళ్లే భక్తుల కోసం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సేవలు అందించనుంది.

ఇందూరు నుంచి పౌర్ణమికి గిరిప్రదక్షిణకు వెళ్లాలనుకునే భక్తుల కోరిక మేరకు సూపర్ లగ్జరీ బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. ఈనెల 21న పౌర్ణమిని పురస్కరించుకుని గిరిప్రదక్షిణ కోసం ఏర్పాటు చేయనున్న బస్సు ద్వారా వెళ్లేందుకు గాను భక్తులు ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించారు. నిజామాబాద్ నుంచి ఈ నెల 19వ తేదీ రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరనుంది. 20వ తేదీ ఉదయం 10 గంటలకు కాణిపాకం చేరుకుంటుంది. అక్కడ వినాయకుడి దర్శనం అనంతరం, సాయంత్రం 5 గంటలకు వేలూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం ఉంటుంది. అనంతరం రాత్రి వరకు అరుణాచలం చేరుకుంటుంది. 21న భక్తులు గిరిప్రదక్షిణ అనంతరం బస్సు తిరుగుప్రయాణం సాయంత్రం 5 గంటలకు మొదలవుతుంది. 22వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు జోగులాంబ శక్తిపీఠం ఆలయానికి చేరుకుంటుంది. దర్శనం తనంతరం ఉదయం 9 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి అదేరోజు సాయంత్రం 6 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుంటుంది. టిక్కెట్టు ధర పెద్దవారికి రూ. 4,200, పిల్లలకు రూ. 3,400గా నిర్ణయించారు. www.tsrtconline.in ద్వారా కానీ సమీప బస్‌స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్‌లో గానీ బుక్‌చేసుకునే సదుపాయం కల్పించారు.

గతేడాది ఐదు బస్సులు..



భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా అరుణాచలానికి బస్సులు కేటాయిస్తున్నాం. భక్తులు ఒక్కొక్కరిగానైనా, బృందాలుగానైనా సరే బుకింగ్ చేసుకోవచ్చు. పౌర్ణమికి ప్రదక్షిణ సమయంలోనైనా సరే, సాధారణ సమయాల్లోనైనా సరే అరుణాచలానికి బస్సులు బుక్ చేసుకోవచ్చు. కొన్ని కుటుంబాలు కలిసి బుక్ చేసుకున్నప్పటికీ బస్సులను కేటాయిస్తాం. గతేడాది అరుణాచలానికి 5 బస్సులను నడిపాం. సుశిక్షితులైన అనుభవం కలిగిన డ్రైవర్లతో సురక్షితమైన ప్రయాణం చేసే అవకాశం ఒక్క ఆర్టీసీ ద్వారా మాత్రమే ఉంది. కేటాయించే బస్సుల్లో పుష్‌బ్యాక్ సీట్లు, టీవీ, మొబైల్ చార్జింగ్ సౌకర్యం ఉంటుంది. ఉమ్మడి నిజామాబాద్ వారు సద్వినియోగం చేసుకోవాలి.

– కె.జానీరెడ్డి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, నిజామాబాద్

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి 3831 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80 టీఎంసీలు) కాగా సోమవా రం సాయంత్రానికి ప్రాజెక్టులో 1062.5 అడుగుల(13.07 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షం

సుభాష్‌నగర్: జిల్లావ్యాప్తంగా సోమవారం రాత్రి విస్తారంగా వర్షం కురిసింది. ఎన్నో రోజులుగా వర్షాల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. ఆరుతడి పంటలతో పాటు వరి పంటకు జీవం పోసింది. వానాకాలం సీజన్ ప్రారంభమై 45 రోజులు కావస్తున్నా.. ఇంత పెద్ద వర్షం కురవలేదు. అడపాదడపా చిరు జల్లులు మాత్రమే కురిశాయి. వర్షాలను నమ్ముకుని చాలామంది రైతులు వరి నాట్లు వేసినప్పటికీ.. నీరందక భూమిలో పగుళ్లు ఏర్పడుతున్నాయి. బోరు మోటార్ల ద్వారా పండుతున్న పంటలకు నీరు పారుతున్నాయి. దీంతో భూగర్భజలాలు అడుగంటిపోయి చాలాచోట్ల బోరుమోటార్లు కూడా వట్టిపోతున్నాయి. గత్యంతరం లేని రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వర్షాల కోసం గ్రామదేవతలకు పూజలు, జలాభిషేకాలు, కప్పతల్లి ఆటలు వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. వర్షాలు కురవకపోవడంతో వరి సాగు నెమ్మదించింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. కాగా వానాకాలం సీజన్ ప్రారంభమై నెలన్నర రోజులు కావస్తున్నా.. నవీపేట్, నందిపేట్ మండలాల్లో మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది. 16 మండలాల్లో సాధారణ, 15 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

తప్పుడు ప్రచారంతో మనస్థాపం చెంది దంపతుల ఆత్మహత్య

నవీపేట: తమపై తప్పుడు ప్రచారంతో మనస్థాపం చెందిన దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నవీపేట మండలంలో సోమవారం చోటుచేసుకుంది. నవీపేట ఎస్సై యాదగిరి గౌడ్, రైల్వే ఎస్సై సాయరెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. పోతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామానికి చెందిన భార్యభర్తలు అనిల్(28), శైలజా(24)కు ఏడాది క్రితం వివాహం జరిగింది. ఇటీవల ఓ ఘటనలో శైలజదే తప్పుగా ఆమె కుటుంబ సభ్యులు ప్రచారం చేశారు. తరచూ నిందిస్తుండటంతో మనస్థాపం చెందిన భార్యభర్తలు చనిపోవాలని నిశ్చయించుకున్నారు. ఈక్రమంలో సోమవారం ఉదయం ఓ సెల్ఫీ వీడియోలో 'బాసర గోదావరి నదిలో దూకి చనిపోతున్నామని' పేర్కొంటూ కొన్ని గ్రూప్‌లలో వైరల్ చేశారు. వెంటనే సన్నిహితులు కోటగిరి ఎస్సై సందీప్‌కు సమాచారమిచ్చారు. ఆయన వెంటనే నవీపేట, బాసర ఎస్సైలకు షేర్ చేశారు. దీంతో పోలీసులు గాలించగా నవీపేట మండలంలోని ఫకీరాబాద్–మిట్టాపూర్ రైల్వే ట్రాక్ పక్కన దంపతులు విగత జీవులుగా కనిపించారు. గుర్తుతెలియని రైలు కిందపడి మృతి చెందారని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటుతాం

- జిల్లా పరిషత్‌ను కైవసం చేసుకుంటాం
- ఎంపీ అర్వింద్ ధర్మపురి
- తప్పుడు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్
- బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్

సుభాష్‌నగర్: జిల్లాలో బీజేపీ పోలింగ్ బూత్‌స్థాయి నుంచి పటిష్టంగా ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి జిల్లా పరిషత్‌ను కైవసం చేసుకుంటామని ఎంపీ అర్వింద్ ధర్మపురి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నగరంలోని శ్రావ్యగార్డెన్‌లో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో రెండు ఎమ్మెల్యే స్థానాలను, తిరిగి ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకున్నామని తెలిపారు. ఈ గెలుపులతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంతో ఉన్నారని, అత్యధిక జెడ్పీటీసీ స్థానాలను గెలుచుకుని జెడ్పీ చైర్మన్ పదవిని కై వసం చేసుకుందామని పిలుపునిచ్చారు. సర్పంచులు, ఎంపీటీసీలు కూడా అధిక స్థానాల్లో గెలిపించుకునేందుకు పనిచేద్దామన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎవరికీ భయపడొద్దని, తామంతా అండగా ఉంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుయకుండా కాలయాపన చేస్తుందని, ప్రజలే వారికి తగిన సమయంలో బుద్ధి చెప్తారన్నారు.

బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు తప్పుడు హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, టీఆర్ఎస్ ఒక్కటేనని, సంతలో కూరగాయలు కొన్నట్టు రేవంత్‌రెడ్డి టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అర్ధరాత్రి పార్టీలో చేర్చుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో బీజేపీ రోజురోజుకూ బలపడుతోందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో అధిక స్థానాల్లో గెలుపొందే దిశగా జిల్లా నాయకత్వం పని చేయాలని సూచించారు.

నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ గత మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 28 మంది కార్పొరేటర్ స్థానాలను గెలుపొందామని, రానున్న ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని దక్కించుకోవడం ఖాయమన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వడ్డి మోహన్‌రెడ్డి కాంగ్రెస్ హామీనిచ్చిన ఆరు గ్యారెంటీలు, రైతాంగ, నిరుద్యోగ సమస్యలు, రాజకీయ పరిస్థితులపై రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టాగా, జహీరాబాద్ పార్లమెంట్ ప్రభారి పెద్దోళ్ల గంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లా ప్రభారి బద్దం లింగారెడ్డి బలపర్చారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి వెంకట రమణి, నాయకులు జీవీ నర్సింహారెడ్డి, గద్దె భూమన్న, మల్లికార్జున్‌రెడ్డి, న్యాలం రాజు, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, స్రవంతిరెడ్డి, కంచెట్టి గంగాధర్, పాట్కూరి తిరుపతిరెడ్డి, కిషన్ నాయక్, నూతుల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అర్చకులకూ బదిలీ!

- ఉమ్మడి జిల్లాలో 45 మంది ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశం
- సంప్రదాయ పూజలకు విఘాతం కలుగుతుందంటున్న సిబ్బంది
- వ్యతిరేకిస్తున్న అర్చక సంఘాలు

సాక్షి, కామారెడ్డి: ఒకేచోట నాలుగేళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా దేవాదాయ శాఖ పరిధిలో పనిచేసే ఉద్యోగుల బదిలీలు కూడా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్న ఆలయ అర్చకులనూ బదిలీ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే వారినుంచి బదిలీల కోసం ఆప్షన్లు తీసుకోవడంతో అర్చకుల బదిలీలు జరుగుతాయా అన్నదానిపై తీవ్ర చర్చ నడుస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గల 17 ప్రధాన ఆలయాల పరిధిలో 45 మంది అర్చకులు పనిచేస్తున్నారు. వీరందరికీ స్థానచలనం కలిగే అయ్యే అవకాశాలున్నాయి. అయితే బదిలీల నిర్ణయాన్ని అర్చకులు వ్యతిరేకిస్తున్నారు. ఆలయాల్లో ఈవోలు, సిబ్బంది బదిలీలు సర్వసాధారణమని, అర్చకులను ఎప్పుడూ బదిలీ చేయలేదని వారు అంటున్నారు. ఎండోమెంట్ యాక్ట్ ప్రకారం ఆలయాల్లో పనిచేసే అర్చకులు ఆయా ఆలయాల సంప్రదాయాల ప్రకారం పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారని, వారిని బదిలీ చేయడం ద్వారా అనాదిగా వస్తున్న సంప్రదాయాలకు విఘాతం కలుగుతుందని పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్నందున అర్చకులకూ బదిలీలు ఉండాలని సర్కారు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అర్చకుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రభుత్వ ఉద్యోగులతో పాటే అర్చకుల బదిలీలు జరుగుతాయా? లేకపోతే ఆప్షన్లతోనే ప్రక్రియ ఆగిపోతుందా అన్నదానిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని వేచి చూస్తున్నారు.

మైనర్లు రయ్..రయ్!

- బైక్‌లతో రోడ్లపై హల్‌చల్
- ప్రమాదాలకు కారణమవుతున్న బాలలు
- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు



ఖలీల్‌వాడి: రయ్.. రయ్ మంటూ రోడ్లపై బైక్‌లను వేగంగా నడుపుతూ మైనర్లు హల్‌చల్ చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సులు లేకుండానే రోడ్డెక్కుతూ, నిబంధనలు అతిక్రమంచి ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. రాత్రిపూట రోడ్లపైకి వచ్చి బైక్‌లతో రోడ్లపై విన్యాసాలు చేస్తున్నారు. మద్యం, గంజాయికి అలవాటు పడిన మైనర్లు రాత్రిపూట మత్తులో బైక్ రైడింగ్‌లు చేస్తున్నారు. అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతూ.. ఎదుటి వారికీ నష్టం కలిగిస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ఇలాంటి వారిపై పోలీసులు సీరియస్‌గానే స్పందిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం రాత్రివేళ బైక్‌పై స్పీడ్‌గా వెళ్తున్న మైనర్లను సీపీ కల్మేశ్వర్ వెంబడించి పట్టుకున్నారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

రోడ్లపై వాహనాలతో చక్కర్లు..

వాహనాలపై మోజుతో తెలిసీ, తెలియని వయస్సులో మైనర్లు రోడ్లపై వాహనాలతో చక్కర్లు కొడుతున్నారు. ఈ వాహనాలను స్పీడ్‌గా నడుపుతూ రోడ్డు ప్రమాదాల భారిన పడిన ఘటనలు కూడా ఉన్నాయి. గతంలో ఓ మైనర్ బాలుడు కుటుంబసభ్యులకు సంబంధించిన ద్విచక్రవాహనం తీసుకొని వేగంగా దూసుకుపోయాడు. వచ్చిరాని డ్రైవింగ్‌తో మరో వాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో బాలుడితో పాటు మరో బైక్‌పై ఉన్న వ్యక్తికి గాయ్యాలయ్యాయి. ఇలాంటి ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయి.

తల్లిదండ్రులదే బాధ్యత..

తమ పిల్లలు ఏం చేస్తున్నారు అనేదానిపై తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతూ ఉండాలి. అంతేకాకుండా ఇంటి పనుల కోసం కొందరు తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తున్నారు. అయితే చేయవద్దని పోలీసులు చెబుతున్నారు. పిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాలు ఇవ్వాలని సూచిస్తున్నారు.

పోలీసుల దృష్టి

మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసులు దృష్టి సారించారు. వాహనాలు నడుపుతున్న మైనర్ల తల్లిదండ్రులను పోలీసులు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. దీంతో పాటు పెద్ద మొత్తంలో జరిమానాలు విధించారు. రూ. 3వేల నుంచి రూ. 5వేల వరకు ఫైన్ వేస్తున్నారు. మైనర్లు మళ్లీ వాహనాలను నడిపి దొరికితే మైనార్లతో పాటు తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

వాహనాలపై వచ్చి ధూమపానం

మైనర్లు బైకులపై గ్రామ శివారు ప్రాంతాలు, పట్టణ ప్రాంతంలో నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్తూ సిగరెట్లు, గంజాయి సేవిస్తున్నారు. జిల్లాలో గంజాయి అమ్మకాలు విస్తృతంగా సాగుతుండడంతో 16 ఏళ్లు కూడా నిండని వాళ్లే ఎక్కువగా అలవాటు పడుతున్నారు. తెలిసీ, తెలియని వయస్సుల్లో గంజాయికి బానిసలుగా మారుతున్నారు. గంజాయిని సేవించడానికి దూరం వెళ్లి, వచ్చేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు.

వాహనదారులపై కేసులు

మైనర్లు డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరం. పోలీసులు, ఆర్టీవో, ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేసిన సమయంలో మైనర్లు దొరికితే వాహన యజమానిపై కేసు నమోదు చేస్తాం. తమ పిల్లలు బైక్, స్కూటీ నడపిస్తారనే సంతోషంతో తల్లిదండ్రులు వాహనాలు ఇస్తున్నారు. వీరు ప్రమాదాలకు కారకులు అవుతారని మర్చిపోవద్దు.

– నారాయణ, ట్రాఫిక్ ఏసీపీ, నిజామాబాద్

క్లుప్తంగా

తైక్వాండోలో బంగారు పతకం



మోపాల్‌: మండలంలోని మంచిప్ప గ్రామంలో ఉన్న జ్ఞానోదయ స్కూల్‌ విద్యార్థి కేతావత్‌ రాణాప్రతాప్‌ తైక్వాండో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించాడు. వెటరన్‌ ఇండియా స్పోర్ట్స్‌ వింగ్‌ తెలంగాణ చాప్టర్‌ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన నేషనల్‌ తైక్వాండో చాంపియన్‌షిప్‌ పోటీల్లో రాణాప్రతాప్‌ ప్రతిభకనబర్చాడని స్కూల్‌ కరస్పాండెంట్‌ దేవశంకర్‌ సోమవారం తెలిపారు. 30 సెకన్లలో నాకౌట్‌ చేసి అద్భుతమైన ప్రదర్శనతో విజృంభించాడని, భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ క్రీడాకారులు మాస్టర్‌ నరహరి నాయక్‌ శిక్షణలో అత్యుత్తమమైన ప్రదర్శనలు ఇస్తారని అన్నారు. రాణాప్రతాప్‌, మాస్టర్‌ నరహరి నాయక్‌ను ఈ సందర్భంగా అభినందించారు.

పీజీ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ (ఇంటిగ్రేటెడ్‌) ఏపీఈ, ఐపీసీహెచ్‌, ఐఎంబీఏ 6, 8, 10వ సెమిస్టర్‌, ఎల్‌ఎల్‌బీ 6వ, ఎంబీఏ, ఎంసీఏ 1, 3వ, ఐఎంబీఏ 7, 9వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. వర్సిటీ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజ్‌, న్యాయ కళాశాల పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు ఉదయం 104 మంది విద్యార్థులకు గాను 98 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరైనట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 246 మంది విద్యార్థులకు గాను 237 మంది హాజరు కాగా 9మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు 13 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ వన్‌టైం చాన్స్‌ బ్యాక్‌లాగ్‌ 5, 6వ సెమిస్టర్‌ పరీక్షలకు సోమవారం 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ (నిజామాబాద్‌), ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ డిగ్రీ కాలేజ్‌ (కామారెడ్డి), ఎస్‌ఆర్‌ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ (బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ (ఆర్మూర్‌) పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షలకు 101 మంది విద్యార్థులకు గాను 98 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 181 మంది విద్యార్థులకు గాను 171 మంది హాజరు కాగా 10 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

కల్లు డిపో నిర్వాహకులపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నిషేధిత మత్తుపదార్థాలను కలుపుతూ కల్లు తయారు చేస్తున్నారని నగరంలోని మూడో కల్లు డిపో నిర్వాహకులపై ఎక్సైజ్‌ కమిషనర్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. ఇటీవల సదరు డిపో పరిధిలోని కల్లు దుకాణంలో ఓ వ్యక్తి మరణించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్‌తోపాటు జిల్లా ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు మత్తుపదార్థాలన నిషేధానికి కృషి చేస్తుండగా, నగరంలోని మూడో డిపోలో మాత్రం మత్తు పదార్థాలు కలిపి కల్లు తయారు చేస్తున్నారని ఆరోపించారు. డిపోలో నిజమైన గీత కార్మికులు లేరని, దొడ్డిదారిన టాపింగ్‌ టెస్ట్‌లో స్థానిక అధికారులతో కుమ్మక్కై కార్మికులుగా చలామణి అవుతున్నారని పేర్కొన్నారు. మూడో డిపోలోని కార్మికులలో చాలా మందికి గ్రామీణ ప్రాంతాల్లో టీఎఫ్‌టీ లైసెన్సులు ఉన్నాయని, ఆ వ్యక్తులే మళ్లీ మూడో డిపోలో టీఎఫ్‌టీ లైసెన్సులు తీసుకున్నారని ఫిర్యాదు చేశారు.

పొలిమేరలు దాటిస్తున్న పోలీసు

బోధన్‌ నియోజకవర్గంలోని అధికారి కనుసన్నల్లో ఇసుక దందా

- రాత్రి వేళల్లో జోరుగా మహారాష్ట్ర, హైదరాబాద్‌కు తరలింపు
- వసూళ్ల కోసం ఇద్దరు సిబ్బంది, ఓ బంధువుతో టీం ఏర్పాటు



ఖలీల్‌వాడి: బోధన్‌ నియోజకవర్గంలోని ఓ పోలీసు అధికారి కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇద్దరు కిందిస్థాయి సిబ్బందితోపాటు తన బంధువు ఒకరితో 'ప్రైవేట్‌ టీం'ను సదరు అధికారి నియమించుకున్నారని, రాత్రి వేళల్లో ఇసుకను తరలిస్తున్న టిప్పర్ల వివరాలను వారు సేకరించి పంపకాలు చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బోధన్‌ నియోజకవర్గం పరిధిలోని మంజీరా పరీవాహక ప్రాంతం నుంచి రాత్రి వేళల్లో ఇసుక తరలించే ముందు పోలీసు అధికారి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అధికారి అనుమతి లేకుండా ఇసుక తరలించే వాహనాల సీజింగ్‌, కేసులు తప్పవు. ఇటీవల ఓ టిప్పర్‌లో ఇసుకను తరలిస్తుండగా అడ్డుకున్న హోంగార్డు టిప్పర్‌ను పోలీస్‌ స్టేషన్‌కు తరలించేందుకు అందులో ఎక్కగా, సమాచారం అందుకున్న టిప్పర్‌ యజమానికి అక్కడికి చేరుకొని ఏకంగా హోంగార్డును కిందికి తోసేయగా గాయాలైనట్లు తెలిసింది. విషయం పెద్దగా కావడంతో టిప్పర్‌లోని ఇసుక వేరే చోట డంప్‌ చేయించి పోలీస్‌ స్టేషన్‌కు తరలించినప్పటికీ ఆ తరువాత వదిలేశారని సమాచారం. ఏదో ఓ కేసు నమోదు చేయాలనుకున్న పోలీసులు ఆ తరువాత రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనం (టిప్పర్‌ యజమానిది) అనుమానాస్పదంగా ఉందని తరలించినట్లు తెలిసింది. అయితే, కేసు నమోదు చేయాలా? వద్దా? సందిగ్ధంలో ఉన్నట్లు తెలుస్తోంది.

అర్ధరాత్రి తరలింపు

అర్ధరాత్రి వేళల్లో పోలీసు అధికారి అనుమతితో టిప్పర్లు, లారీల్లో జోరుగా ఇసుక తరలిస్తుండగా, ఎన్ని వాహనాలు వచ్చాయనే వివరాలు సేకరిస్తున్న 'ప్రైవేట్‌ టీం' ఎప్పటికప్పుడు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మామూళ్లు ముట్టిన వెంటనే వాహనాలను సేఫ్‌గా పొలిమేరలు దాటిస్తున్నారు. ఇలా ప్రతి రోజూ అనేక వాహనాల్లో ఇసుక మహారాష్ట్ర, హైదరాబాద్‌, నిజామాబాద్‌ జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. టిప్పర్లు, లారీల డ్రైవర్లు అతివేగంగా నడుపడంతో రోడ్డు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి.

మన సామాజిక వర్గమే..

పోలీసు అధికారి సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తి ఉండే గ్రామం నుంచి ఇసుక తరలింపునకు అనుమతించినట్లు తెలుస్తోంది. అధికారి పచ్చజెండా ఊపిన వాహనాలు ఆ ఊరికి వెళ్లి ఇసుకను లోడ్‌ చేసుకుంటున్నారు. ఇదంతా తెలిసిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పెట్రోలింగ్‌లో ఉన్న వారు సైతం ఇసుక టిప్పర్లు కనిపించినా పట్టించుకోవడం లేదంటున్నారు.

ప్రజావాణికి 91 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్‌: ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 91 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌, నగరపాలక సంస్థ కమిషనర్‌ మకరందు, డీఆర్డీవో సాయాగౌడ్‌, డీపీవో చక్రవర్తుల తరుణ్‌, నిజామాబాద్‌ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు అందజేశారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు.

న్యాయం చేయాలని విద్యార్థుల వినతి

నగరంలోని న్యూ ఐటీఐ కళాశాల ఆవరణలో ఉన్న ఐటీఓటీ (ఇనిస్టిట్యూట్‌ ఫర్‌ ట్రైనింగ్‌ ఆఫ్‌ ట్రైనర్స్‌) కళాశాలలో చదువుతున్న 20 మంది విద్యార్థుల అడ్మిషన్ల డాటా గల్లంతయ్యిందని, తమకు న్యాయం చేయాలని విద్యార్థులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. తాము అడ్మిషన్‌ పొంది బయోమెట్రిక్‌ సిస్టం ద్వారా అటెండెన్స్‌ ఇచ్చామని తెలిపారు. ప్రతి విద్యార్థికి 60 నుంచి 80శాతం వరకు అటెండెన్స్‌ ఉందని, వార్షిక పరీక్షల కోసం ఎగ్జామినేషన్‌ ఫీజు కట్టడానికి జూలై 16 చివరి తేదీ అని పేర్కొన్నారు. ఫీజు కట్టేందుకు ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే తమ డాటా, కళాశాలకు సంబంధించిన వివరాలు కనిపించడం లేదన్నారు. పరీక్ష తేదీ దగ్గర పడుతోందని, కలెక్టర్‌ స్పందించి సమస్యకు పరిష్కారం చూపి న్యాయం చేయాలని కోరారు. అంతకుముందు కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు.



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌

కార్యకర్తలకు అండగా ఉంటా



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎంపీ అర్వింద్‌ ధర్మపురి

సుభాష్‌నగర్‌: బూత్‌స్థాయి కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని, వారిని ఆపదలో ఆదుకోవడం అదృష్టంగా భావిస్తానని ఎంపీ అర్వింద్‌ ధర్మపురి పేర్కొన్నారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో అర్వింద్‌ ధర్మపురి కార్పస్‌ ఫండ్‌ – బూత్‌స్థాయి కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా పార్లమెంట్‌ పరిధిలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన 21మంది బూత్‌స్థాయి కార్యకర్తల కుటుంబాలకు రూ.8.80లక్షల చెక్కులను సోమవారం అందజేశారు. 2021 సెప్టెంబర్‌ 17వ తేదీన నిర్మల్‌ సభలో కేంద్రమంత్రి అమిత్‌ షా.. అర్వింద్‌ ధర్మపురి కార్పస్‌ ఫండ్‌ – బూత్‌స్థాయి కార్యకర్తల సంక్షేమ నిధిని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అర్వింద్‌ మాట్లాడుతూ.. సంక్షేమ నిధి ప్రారంభించిన నాటి నుంచి 186 మంది కార్యకర్తల కుటుంబాలకు సాయం చేశామన్నారు. ఫౌండేషన్‌ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న వారు ఈ సందర్భంగా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

బెస్ట్‌సర్వీస్‌ సొసైటీ నేషనల్‌ అవార్డులకు ఎంపిక



ఆహ్వానపత్రాన్ని అందుకుంటున్న సురేశ్‌కుమార్‌

నిజామాబాద్‌నాగారం: బెస్ట్‌ సర్వీస్‌ సొసైటీ నేషనల్‌ అవార్డును ఏఈ ఆపరేషన్‌ డీ–2 నిజామాబాద్‌ జూనియర్‌ లైన్‌మెన్‌ చుక్క సురేశ్‌కుమార్‌, ఏఈ ఆపరేషన్‌ డి–2 నిజామాబాద్‌ జూనియర్‌ లైన్‌మెన్‌ గొల్ల సీనయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అవార్డు ఆహ్వానపత్రాన్ని అవార్డు సెలెక్షన్‌ కమిటీ నేషనల్‌ చైర్మన్‌ నల్లా రాధాకృష్ణ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడానికి బహుజన సాహిత్య అకాడమీ ప్రతి ఏటా ప్రజా ఉద్యమకారులు, సంఘసేవకులు, రచయితలు, కవులు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డును అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం గౌతమ్‌, రాష్ట్ర కో ఆర్డినేటర్‌ హన్మాండ్ల విష్ణు, సెలక్షన్‌ కమిటీ మెంబర్‌ నాగరాజు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న రిటైర్డ్‌ ఉద్యోగులు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చొరవ చూపాలని రిటైర్డ్‌ డీఆర్వో మహేశ్‌ కోరారు. పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్‌ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జేఏసీ ప్రతినిధి బృందం కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మహేశ్‌ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రిటైర్డ్‌ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. దీనిపై పలుమార్లు ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చేపట్టామన్నారు. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, నగదు రహిత వైద్యం ఎండమావిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. డీటీఎఫ్‌ రాష్ట్ర నాయకుడు శాంతన్‌, జేఏసీ నాయకులు ఎల్‌ శ్రీధర్‌, రిటైర్డ్‌ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రామ్మోహన్‌రావు, జేఏసీ నాయకులు ముత్తారం నరసింహస్వామి, మార్కెటింగ్‌ నాయకులు రాజేందర్‌, పెన్షనర్ల నాయకులు ఆర్మూర్‌ బాబాగౌడ్‌, బోధన్‌ కృష్ణారావు, సిర్ప హన్మాండ్లు, లావు వీరయ్య, హమీద్‌, ఈవిల్‌ నారాయణ, లైబ్రరీ గంగారాం, స్వరూపరాణి, శాంతాబాయి, సుదర్శన్‌ రావు, ప్రసాద్‌ రావు, భోజారావు, లక్ష్మీనారాయణ, పూర్ణచంద్ర రావు పాల్గొన్నారు.

వినియోగదారుల 'వాణి' పట్టేదెవరికి?

విద్యుత్‌ ప్రజావాణి నిర్వహణలో అధికారుల అలసత్వం

- సీఎండీ ఆదేశాలు బేఖాతర్‌
- వినియోగదారుల పడిగాపులు



ఉదయం 10.48గంటలకు రూరల్‌ ఈఆర్‌వో ఎదుట వేచి ఉన్న వినియోగదారులు

నిజామాబాద్‌నాగారం: వినియోగదారులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో ప్రత్యేకంగా ప్రారంభించిన 'విద్యుత్‌ ప్రజావాణి' నిర్వహణలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. సోమవారం ఉదయం 10గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణి 11 గంటల తరువాత ప్రారంభమైంది. దీంతో తమ సమస్యలను విన్నవించేందుకు వచ్చిన వినియోగదారులు కార్యాలయం ఎదుట పడిగాపులుకాయాల్సి వచ్చింది.

జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న నిజామాబాద్‌ రూరల్‌ ఈఆర్‌వో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహణలో సమయపాలనను అధికారులు పట్టించుకోలేదు. వినియోగదారులు తమ సమస్యలను విన్నవించేందుకు వచ్చి కార్యాలయం ఎదుట అధికారుల కోసం ఎదురు చూడగా వారిని పట్టించుకునే వారు కరువయ్యారు. కనీసం తాళం తీయకపోవడంతో బయటే వేచి ఉన్నారు. 11గంటల తరువాత వచ్చిన అధికారులు కార్యాలయం తెరిచి ప్రజావాణిని ప్రారంభించినప్పటికీ.. అప్పటికే వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా సాయంత్రం సమయంలో ఎస్‌ఈ కార్యాలయంలో నిర్వహించిన 'విద్యుత్‌ ప్రజావాణి'లో మూడు ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈఆర్‌వో కార్యాలయం వద్ద ఉదయం వేచి ఉండి వెనుదిరిగిన వారే సాయంత్రం మళ్లీ వచ్చి తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు అందజేసినట్లు తెలుస్తోంది.

లైట్‌గా తీసుకుంటున్న అధికారులు

జిల్లాలోని ఏఈ సెక్షన్‌, ఏడీఈ సెక్షన్‌, ఏవో(అకౌంట్‌) సెక్షన్‌, ఆయా ఇవిజన్‌ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు జిల్లా విద్యుత్‌ అధికారి కార్యాలయంలో విద్యుత్‌ ప్రజావాణి నిర్వహించాలని సంస్థ సీఎండీ ఆదేశాలు జారీ చేశారు. కొన్ని సెక్షన్లలో సమయ పాలన పాటిస్తుండగా, మరికొన్ని చోట్ల అధికారులు 'లైట్‌'గా తీసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిజామాబాద్‌ రూరల్‌ అకౌంట్‌ సెక్షన్‌తోపాటు మరికొన్ని సెక్షన్లలో సీఎండీ ఆదేశాలను పెడచెవిన పెడుతున్నారని వినియోగదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. లక్షల్లో జీతాలు తీసుకుంటూ కనీసం సమయ పాలన పాటించకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు. జిల్లా, డివిజన్‌, ఏడీఈ, ఏఈ, ఏవో సెక్షన్‌ల అధికారులు సీఎండీ ఆదేశాలను సీరియస్‌గా తీసుకోవాల్సి ఉండగా, పైస్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే 'ప్రజావాణి' నిర్వహణ అస్తవ్యస్తంగా కొనసాగుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఆదేశాలు పాటించాల్సిందే

సీఎండీ ఆదేశాల మేరకు విద్యుత్‌ ప్రజావాణిని జిల్లాలోని ఆయా సెక్షన్‌లలో నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఆదేశాలు పాటించాల్సిందే. విద్యుత్‌ ప్రజావాణిని ఎవరు నిర్లక్ష్యం చేసినా తగిన చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదుదారులు వచ్చినా, రాకున్నా సమయపాలన పాటించాలి.

– రవీందర్‌, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ

మధ్యాహ్న బియ్యంలో రాళ్లు



నవీపేట: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యంలో వారం రోజుల నుంచి రాళ్లు వస్తున్నాయని నిర్వాహకులు సోమవారం విలేకరుల ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. రాళ్లతో పాటు చిన్న చిన్న పురుగులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని కోరుతున్నారు.

డీఎస్సీ పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు

ఖలీల్‌వాడి: డీఎస్సీ పరీక్షలు ఈ నెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలోని నాలెడ్జ్‌ పార్క్‌ స్కూల్‌ డీఎస్సీ పరీక్షా కేంద్రం వద్ద పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీపీ కల్మేశ్వర్‌ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే సెంటర్‌ వద్ద 144 సెక్షన్‌ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షలు 13 రోజుల పా టు కొనసాగనున్నాయని తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రంలో జిరాక్స్‌ సెంటర్లు గాని ఇతర షాపులు తెరిచి ఉంచకూడదని ఆదేశించారు.

దాడి ఘటనపై కేసు నమోదు చేయాలి



సీపీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న నాయకులు

ఖలీల్‌వాడి: తన భర్తపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని నందిపేట్‌ మండలం తల్వేద గ్రామానికి చెందిన పోసాని అనే మహిళ సీపీ కల్మేశ్వర్‌ను కోరింది. ఈ మేరకు సీపీఎం, ఎమ్మార్పీఎస్‌, అంబేడ్కర్‌ సంఘం, కేవీపీఎస్‌ నాయకులతో కలిసి సోమవారం సీపీని కలిసి ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ వ్యవసాయ భూమిలో నుంచి సాయిరెడ్డి అనే వ్యక్తి ప్రోద్బలంతో కొందరు రోడ్డు వేశారని, దీనిపై ప్రశ్నించిన భర్త పెద్ద పెద్దన్నపై నలుగురు వ్యక్తులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయని తెలిపింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, నలుగురిపై అత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు, దాడి చేయించిన సాయిరెడ్డి పేరును ఎఫ్‌ఐఆర్‌లో చేర్చలేదన్నారు. ఈనెల 7వ తేదీన ఏసీపీ విచారణ నిమిత్తం గ్రామానికి రాగా, తాము సాయిరెడ్డి పేరు చెబితే.. అతడి పేరు చెప్పకు అంటూ అందరి ముందే ఏసీపీ బెదిరించాడని పోసాని ఆవేదన వ్యక్తం చేసింది. రికార్డ్‌ స్టేట్‌మెంట్‌లో సాయిరెడ్డి పేరు నమోదు చేయలేదన్నారు. తన భర్తపై దాడికి కారణమైన సాయిరెడ్డిపై కేసు నమోదు చేయాలని ఏసీపీని కోరారు.

ఉన్నత పాఠశాల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్‌..

నిజామాబాద్‌అర్బన్‌: విద్యార్థులకు అందిస్తున్న నాసిరకం మధ్యాహ్నం భోజనంపై 'మధ్యాహ్నం.. అధ్వానం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి డీఈవో స్పందించారు. నగరంలోని కోటగల్లీ బాలికల ఉన్నత పాఠశాలను ఎంఈవోతో కలిసి డీఈవో దుర్గాప్రసాద్‌ తనిఖీ చేసి విచారణ చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఏజెన్సీ నిర్వాహకుడు, పాఠశాల టీచర్లకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విద్యాశాఖాధికారులు వివరాలు నమోదు చేసుకొని మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యాన్ని పరిశీలించారు.

కారులో వచ్చి చోరీలు

- తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌ చేసిన దుండగులు
- రెండిళ్లలో నుంచి నగదు అపహరణ

నిజామాబాద్‌ రూరల్‌: కారులో వచ్చిన దుండగులు తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. రెండు ఇళ్లలో నుంచి నగదును ఎత్తుకెళ్లారు. నిజామాబాద్‌ రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఆయా ఘటనలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగర శివారులోని ముబారక్‌నగర్‌ ప్రాంతంలోని శివసాయి ఎన్‌క్లేవ్‌లో నివసించే తోపారం శ్రీనివాస్‌ ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి కోరుట్లలో బంధువుల ఫంక్షన్‌కు వెళ్లాడు. అలాగే ముబారక్‌నగర్‌లోని గాంధీ విగ్రహం ప్రాంతంలో నివాసముంటున్న క్యాతం కళావతి ఇంటికి తాళం వేసి అర్సపల్లిలోని తన కూతురి ఇంటికి వెళ్లింది. అర్ధరాత్రి వేళ కారులో వచ్చిన దుండగులు శ్రీనివాస్‌ ఇంటిని తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లోని సామగ్రిని చిందరవందర చేసి లాకర్‌లోని రూ.40వేల నగదును ఎత్తుకెళ్లారు. అనంతరం కళావతి ఇంటి తాళాన్ని పగులగొట్టి రూ.20వేలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్‌ తెలిపారు.



సీసీ ఫుటేజీలో దుండగుడి కదలికలు



సామగ్రిని చిందరవందర చేసిన దుండగులు

భయాందోళనలో ప్రజలు

తాళం వేసిన ఇళ్లను దుండగులు టార్గెట్‌ చేస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెట్రోలింగ్‌ పకడ్బందీగా లేకపోవడంతో ముబారక్‌నగర్‌, గంగాస్థాన్‌ ఫేజ్‌–1, 2, మారుతి నగర్‌, గూపన్‌పల్లి ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉందంటున్నారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవీపేట: మండలంలోని అబ్బాపూర్‌(ఎం)లో బాసర రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెంజల్‌ మండలం వీరన్నగుట్టకు చెందిన ప్రవీణ్‌కు తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. వీరన్నగుట్ట నుంచి నిజామాబాద్‌ వైపు వెళ్తుండగా బైక్‌ అదుపుతప్పి ప్రవీణ్‌ కిందపడిపోవడంతో కాళ్లకు తీవ్రగాయాలయ్యాయన్నారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

బోధన్‌రూరల్‌: మద్యానికి బానిసై సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్‌ గ్రామానికి చెందిన వి.వెంకటేశ్‌ (33) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటేశ్‌కు తొమ్మిదేళ్ల క్రితం పెళ్లయి విడాకులయ్యాయి. అప్పటి నుంచి తల్లిదండ్రులతో ఉంటున్న వెంకటేశ్‌ మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఈనెల 13న గ్రామశివారులోని చెరువులో దూకాడు. సోమవారం నీటిలో వెంకటేశ్‌ మృతదేహం తేలింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొన్న వాహనం

మాచారెడ్డి: విద్యుత్‌ స్తంభాన్ని వాహనం ఢీ కొన్న ఘటనలో స్తంభం ధ్వంసం కాగా వాహనంలో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వాహనం ఢీ కొనడంతో విద్యుత్‌ సరఫరా నిలిచిపోగా పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన సోమవారం గజ్యానాయక్‌తండా చౌరస్తాలో చోటు చేసుకుంది.